క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఫైర్‌స్టేషన్, ప్రభుత్వాసుపత్రి ఏరియా, శ్రీనివాస హాలు రోడ్డు, జెండామాను వీధి, రోటరీపురం, ఉలిమెల్ల రోడ్డు, అహోబిలాపురం, ముద్దనూరు రోడ్డు, చెన్నారెడ్డి కాలనీ, నగరిగుట్ట, చిన్నన్న రూములు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ జేఈ రమేష్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. శనివారం ఆయన తెలుపుతూ 33కె.వి విద్యుత్ స్తంభాల లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

చక్రాయపేట : గ్రామాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. శనివారం మండలంలోని మహదేవపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రైతులు బ్యాంకులో తమ రుణాలు రెన్యువల్ చేసుకునేందుకు వీలుగా 1బిలు వచ్చేలా చూడాలని జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, వీఆర్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భారతీయుల ఐక్యతకు హిందీ సహాయపడుతుంది



యురేనియం అధికారులతో మాట్లాడుతున్న చెన్నై ఆదాయపు పన్ను శాఖ మాజీ డైరెక్టర్ విజయలక్ష్మి

వేముల : భారతీయులందరిని ఏకం చేయడానికి హిందీ సహాయపడుతుందని యూసీఐఎల్ డీజీఎం సుమన్ సర్కార్ తెలిపారు. శనివారం మండలంలోని తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టులో హిందీ వర్క్‌షాపు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెన్నైలోని ఆదాయపు పన్ను శాఖ మాజీ డైరెక్టర్, తిరుపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిందీ కన్సల్టెంట్ సి.విజయలక్ష్మి హాజరయ్యారు. యూసీఐఎల్ డీజీఎం సుమన్ సర్కార్ మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఉద్యోగులకు హిందీ నోట్‌ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో యూసీఐఎల్ చీఫ్ మేనేజర్లు, సౌంజోయ్ చటర్జీ, గోపినాథ్ దాస్, అడిషనల్ సూపరింటెండ్ విపిన్ కుమార్ శర్మ, యురేనియం అధికారులు ఎం.ఎస్.రావు, విజయ్‌కుమార్, గౌతమ్ కె.అహ్మద్ అలీ, రాధిక, వంశీకృష్ణ, శైలజ, దస్తగిరి, రాజు, జె.డి.కన్సన్, వాసుదేవారెడ్డి, తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీదారుని ఇంటిని సందర్శించాలి

వల్లూరు : రెవెన్యూ సదస్సులో తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చిన ప్రతి ఒక అర్జీదారుని ఇంటికి వెళ్లి సమస్యను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి వచ్చే జన్మ భూమి కార్యక్రమం జరిగే నాటికి పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్‌డీవో కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇప్పటి వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల గురించి వీఆర్‌వోలతో సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవాణి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీవృషభాచలేశ్వరుడు



వేంపల్లె : స్థానిక శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానంలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా రెండవ శనివారం పురస్కరించుకుని శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రవీణ్ నేతృత్వంలో స్వామి వారికి అభిషేకం, నక్షత్ర హారతి, కుంభహారతి, మంత్రపుష్పం, మహా మంగళహారతి, అర్చన తదితర విశేష పూజలు నిర్వహించార. ధనుర్మాస పూజల్లో భాగంగా భక్తులు ప్రతిరోజు ఉభయదారులుగా పూజలు నిర్వహించి భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. మహిళలు ఆలయంలో స్వామివారి ఎదుట కోలాటంతో పాటలు పాడి తమ భక్తిని చాటుకున్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

- గోతులమయంగా ప్రధాన రోడ్లు
- దెబ్బ తింటున్న వాహనాలు
- ఒళ్ళు హూనం అవుతోందని వాహనదారుల గగ్గోలు
- ఇబ్బందులు పడుతున్న వేంపల్లి వాసులు

వేంపల్లె : వేంపల్లె ప్రధాన రోడ్లు ప్రమాదకరంగా మారాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారులు భారీ గోతులు తేలి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆయా ప్రధాన రోడ్లపై ఏర్పడిన భారీ గుంతలు కూడా పాలకులకు కనిపించడంలేదు. ప్రధాన రోడ్లపై గుంతలనే పూడ్చలేని ప్రభుత్వం, ఇక గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు ఏమాత్రం నిర్మిస్తుందని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విలాసవంతమైన భవనాలు, ఖరీదైన ప్రాంతంగా జిల్లాలోనే పేరొందిన వేంపల్లె నివాసితులు అధ్వాన రహదారితో అవస్థలు పడుతున్నారు. కడప రోడ్డులోని హనుమాన్ జంక్షన్ నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా రాజీవ్ కాలనీ వరకు రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది.

కనీస మరమ్మతులకు కూడా నోచుకోని రోడ్లు

రోడ్డు విస్తరణలో భాగంగా ప్రధాన రోడ్డు నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోవడంతో కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనాదారులు గుంతలను తప్పించే క్రమంలో అదుపు చేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన రహదారుల్లో అడుగడుగునా గుంతలు ఉండడంతో వేంపల్లె వాసులు నరక యాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్లలో మొత్తం బస్సులతో రద్దీగా ఉంటుందని, రహదారులు గోతులమయం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయి. వాహనాలు దెబ్బతినడంతోపాటు ఒళ్ళు హూనమవుతోందని వాహనదారులు వాపోతున్నారు. ఇదే రహదారులపై నిత్యం రాజకీయ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు వాహనాల్లో వెళుతుంటారు. వారికి ఈ గుంతలు కనిపించవా? అంటూ వేంపల్లె ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

విపరీతమైన ట్రాఫిక్ సమస్యతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేంపల్లెలో 72 అడుగుల మేర రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టింది. కడప, పులివెందుల, గండికి పోయే రోడ్లు దాదాపు రూ 60.05 కోట్ల వ్యయంతో 4.2 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల సిమెంటు రోడ్లు, సెంటర్ లైటింగ్, ఫుట్ పాత్‌లను ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. కాగా నిర్మాణ పనులు ప్రారంభించి పులివెందుల రోడ్డులో కొంతమేర ఒకవైపు సిమెంటు రోడ్డును నిర్మించారు. తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధాంతరంగా నిర్మాణ పనులు ఆపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దసరా పండుగ తర్వాత నిర్మాణ పనులు ప్రారంభిస్తామని గొప్పలు చెప్పుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా రోడ్డు నిర్మాణ పనులు చేసేందుకు పట్టించుకున్న పాపాన పోలేదు. సంక్రాంతి పండుగ తర్వాత అయినా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెడతారో.. లేదోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



వేంపల్లెలో అర్ధాంతరంగా నిలిచిపోయిన సీసీ రోడ్డు పనులు

దుమ్ము ధూళితో ఇబ్బందులు



వేంపల్లెలో ప్రధాన రహదారుల నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో దుమ్ము ధూళితో ఇబ్బంది పడుతున్నాం. అంతేకాకుండా ఈ రోడ్లన్నీ పూర్తిగా గోతుల మయంగా మారింది. ఇటీవల రెండు రోజులపాటు కురిసిన చిన్నపాటి వర్షానికి గోతులు సైతం వాహనాల రాకపోకలతో పెద్దవి అయ్యాయి. వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. వాహనాలు తప్పించే క్రమంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. అధికారులు ఒకసారి రోడ్లను పరిశీలించాలి.

– హబీవుల్లా, స్థానికుడు, పులివెందుల రోడ్డు, వేంపల్లె

జనవరిలో రోడ్ల నిర్మాణ పనులు చేపడతాం

సంబంధిత కాంట్రాక్టర్‌కు త్వరగా ప్రధాన రోడ్ల నిర్మాణ పనులను చేపట్టాలని కోరాం. ఇప్పటికే రోడ్లకు ఇరువైపులా కాలువలు పూర్తయ్యాయి. కొంతమేర సిమెంటు రోడ్లు వేసిన బిల్లులను రూ.6.60 కోట్లు చెల్లించాం. ఇంకా రూ.1.72 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. తొందరగా రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తే బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

– మనోహర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ, వేంపల్లె





గుంతలమయంగా మారిన వేంపల్లె ప్రధాన రోడ్డు

సమస్యల పరిష్కారానికే కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికే కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌన్సిల్ హాలులో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సమావేశానికి సంబంధించి అజెండాను చదివి వినిపించారు. వార్డులలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యంగా వీధిలైట్లు, యూజీడీ సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ చూపారు. దీనికి సంబంధించిన అధికారులతో వాటి నిర్వహణ గురించి చర్చించారు. మున్సిపాలిటీలో 52 వీధి లైట్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో డబ్బులు లేవన్నారు. అలాగే మున్సిపల్ హౌసింగ్ కాలనీకి సంబంధించి 8401 ఇళ్లలు కాగా, అందులో 700 ఇళ్లలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన వాటిని కూడా పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్ డీఈ రమణారెడ్డిని కోరారు. ఇంకా ఎవరైనా ఇళ్లలేని లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియజేశారు. బడ్జెట్ రాగానే అన్ని పనులు పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయిస్తారన్నారు. మున్సిపాలిటీలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ అధికారులకు సూచించారు.

ఎవరూ రాలేదని చెప్పడం హాస్యాస్పదం :

అజెండాలో చెప్పిన విధంగా ఒక 20 నిమిషాలకు కౌన్సిల్ ప్రారంభించడం జరిగిందని, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అందరి కంటే ముందే వచ్చానని, ఇంకా ఎవ్వరు రాలేదని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. గత నెలలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ కొన్ని హామీలు ఇవ్వడం జరిగిందని, కాంట్రాక్టు బిల్స్ గురించి, అలాగే కొన్ని అభివృద్ధి పనుల గురించి నిధులు తెస్తామని చెప్పడం జరిగిందన్నారు. అయితే ఇప్పుడు గౌరవ సభ్యులు ఆ సమస్యలు మీద నిలదీస్తారన్న ఉద్దేశ్యంతో కొత్త వంత పాడుతూ బాయ్ కాట్ చేస్తున్నారని, పబ్లిసిటీ స్టంట్ కోసమే బాయకాట్ చేశారే తప్ప ఇంకోటి కాదన్నారు. మీరు ఎప్పుడు కౌన్సిల్ మీటింగ్‌కు వచ్చినా మిమ్మలను నిలదీస్తామని, మీ వైఫల్యాలను ఎండగడతామన్నారు.

దళితుల స్థలాలను కూటమి బకాసురులు కబ్జా చేస్తున్నారు



జేసీబీలను అడ్డుకున్న సీపీఎం నాయకులు

జమ్మలమడుగు : మైలవరం మండలం దొమ్మర నంద్యాల గ్రామంలో దళితులకు సంబంధించిన స్థలాలను కూటమినేతలు కబ్జాలు చేస్తున్నారని సీపీఎం పార్టీ కార్యదర్శి ఏసుదాసు దాసరి విజయ్‌లు తెలిపారు. శనివారం భూ ఆక్రమణకు పాల్పడుతున్న కూటమినేతల జేసీబీలను సీపీఎం నేతలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ దొమ్మరనంద్యాల గ్రామంలో దళితులను చంపైనా సరే స్థలాలు కబ్జాలు చేస్తామంటూ కూటమినేతలు బాహాటంగా చెబుతున్నారన్నారు. దళితలకు దొమ్మరనంద్యాల గ్రామంలో భద్రత లేకుండపోయిందని వాపోతున్నారు. వందల సంవత్సరాల నుంచి ఉన్న ఎస్సీల స్థలాలను కూటమి నేతలు జేసీబీలు తెచ్చి అడ్డువచ్చిన దళితులను చంపేస్తామని భయపెడుతున్నారన్నారు. స్థానిక శాసనసభ్యుడు దళితులకు హామీ ఇవ్వాలన్నారు. భూ ఆక్రమణలు చేస్తూ దళితులను బెదిరిస్తున్న కూటమి నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలి



వెల్లటూరులో పురుగు మందుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

పెండ్లిమర్రి : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని వెల్లటూరు గ్రామంలోని పురుగు మందుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి ఎరువులు, మందుల గౌడలను తనిఖీ చేశారు. అధిక ధరలకు విక్రయించిన, నకిలీ పురుగు మందులు రైతులకు అమ్మిన అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మందులు విక్రయించిన ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఓబులేసు, ఏఈఓ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

వల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ కోసం వచ్చిన బృందం, ఆ శాఖ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో రఘురాం తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో శనివారం జరిగిన కో ఆర్డినేషన్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసకురావాలన్నారు. కార్యక్రమంలో ఏపీవోలు సుధారాణి, పార్థ సారథి, ఎస్‌ఆర్‌పీ కన్నారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సోషల్ ఆడిట్ డీఆర్‌పీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా మండల పూజ



హోమాల్లో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ గంగమ్మ, శ్రీ దత్తాత్రేయ ఆలయాల్లో శనివారం మండల పూజను ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఈ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు జరిగి 41 రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, ఆయన సతీమణి, ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా వేద పండితులు విజయ్ భట్టర్ ఆధ్వర్యంలో శ్రీ గంగమ్మ, శ్రీ దత్తాత్రేయ స్వామి మూల విరాట్‌లకు అభిషేకాలను నిర్వహించారు. మహా సంకల్పం అనంతరం పుణ్యాహ వచనం నిర్వహించారు. అనంతరం ప్రధాన కళశ పూజ, మండల ఆరాధన నిర్వహించారు. వేద మంత్రాలతో దుర్గా హోమాన్ని నిర్వహించారు. మహా పూర్ణాహుతి అనంతరం భక్తులు హోమ ప్రదక్షిణ చేశారు. వేద పండితులు భక్తులకు వేద ఆశీర్వచనాలను, తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని వెలికితీసేందుకే విజ్ఞాన ప్రదర్శనలు



కమలాపురంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ సుభాషిణి



ముద్దనూరులో జిల్లాస్థాయికి ఎంపికైన ప్రదర్శనతో ఎంఈవోలు



లింగాలలో విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

కమలాపురం : విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని వెలికి తీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు వేదికగా నిలుస్తున్నాయని ఎంఈఓ–2 సుభాషిణి తెలిపారు. శనివారం స్థానిక జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తక్కువ ఖర్చుతో సాంకేతికత జోడించి స్వయంగా తయారు చేసిన ప్రదర్శనలు ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలుగా నిలిచిన సైన్స్ ఉపాధ్యాయులు నాగమునెయ్య, చంద్రశేఖర్, శ్రీదేవిలు పర్యవేక్షించి ఆ ప్రదర్శనల పట్ల విద్యార్థులకు ఉన్న అవగాహనను పలురకాల ప్రశ్నలు వేసి తెలుసుకున్నారు. అనంతరం విజేతలను ప్రకటించారు. విజేతలకు ఎంఈఓ బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న విజ్ఞానాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి సైన్స్ ఫెయిర్‌లు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులందరూ ఎగ్జిబిట్స్ తయారు చేసేందుకు ఉత్సకత చూపాలన్నారు. ప్రస్తుతం మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కు మంచి ఎగ్జిబిట్స్ తయారు చేయాలన్నారు. అందుకు సైన్స్ ఉపాధ్యాయులు సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గర్ల్స్, బాయ్స్ హైస్కూల్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతల వివరాలు

మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో గ్రూప్ విభాగంలో కమలాపురం జడ్పీ బాయ్స్ హైస్కూల్‌కు చెందిన ప్రేమ్‌కుమార్, తేజ నరసింహాచారి ప్రథమ స్థానంలో నిలిచారు. కోగటం యూపీ స్కూల్‌కు చెందిన సుహాని, తస్లీంలు ద్వితీయస్థానంలో, ఆసిఫా తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే వ్యక్తిగత ప్రదర్శనలో గురుకుల పాఠశాలకు చెందిన అవనిక ప్రథమ స్థానంలో నిలవగా, జడ్పీహెచ్‌ఎస్ ఎర్రగుడిపాడుకు చెందిన శ్రీధర్‌రెడ్డి ద్వితీయ స్థానంలో, చిన్న చెప్పలి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన లోహిత్‌కుమార్ తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే టీచర్ విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ బాయ్స్, కమలాపురంకు చెందిన కె. అరుణ లో కాస్ట్ ఆఫ్ వాటర్ ఫిల్టర్ ప్రదర్శన తయారు చేసి ప్రథమ స్థానంలో నిలిచారు.

జిల్లాస్థాయి విద్యా వైజానిక ప్రదర్శనకు ఎంపిక

ముద్దనూరు : మండలస్థాయి విద్యావైజానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు, ప్రదర్శనలు, ఉపాధ్యాయుడు జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో మండలస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలలో వ్యక్తిగత విభాగంలో ముద్దనూరు బాలికోన్నతపాఠశాల 9వ తరగతి విద్యార్థిని జరినా, గ్రూప్ విభాగంలో యామవరం విద్యార్థినులు విజయవాణి, కుమారిలు ఉపాధ్యాయ విభాగంలో ముద్దనూరు బాలుర ఉన్నతపాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు జయాకర్‌లు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారులు శివప్రసాద్, నాగేశ్వరనాయక్‌లు తెలిపారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలి

లింగాల : విద్యార్థులు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తితో శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని ఎంఈఓ రామకృష్ణయ్య తెలిపారు. శనివారం ఎగువలింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు ఎంఈఓ హాజరైన విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్, గణిత నమూనాలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందించారు. అనంతరం అత్యున్నత నమూనాలు ప్రదర్శించిన ఇప్పట్ల ప్రతిభా గురుకుల బాలికల పాఠశాల, కోమన్నూతల జెడ్పీ హైస్కూలు, పెద్దకుడాల ఉన్నత పాఠశా విద్యార్థులు విజేతలుగా నిలిచి జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యారు. అనంతరం మండలస్థాయి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.సురేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఖాదర్‌బాషా సతీమణి సల్మా అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.నరేన్ రామాంజులరెడ్డి మృతురాలి నివాసానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వారం రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిలుపుదల

పులివెందుల టౌన్ : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పరమవదించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పట్టణంలోని శిల్పారామంలో వారం రోజులపాటు ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరగవని శిల్పారామ ఏఓ సుధాకర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈనెల 26వ తేదీనుంచి జనవరి 1వ తేదీవరకు ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించలేదని. జనవరి 1న నిర్వహించే అన్ని సాంస్కతిక కార్యక్రమాలను రద్దు చేడయం జరిగిందన్నారు. సందర్శకులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సహకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రత్నం



ముద్దనూరు : జిల్లా సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రత్నం ఎన్నికయ్యారు. శనివారం కడపలో జిల్లా కేంద్ర బ్యాంకులో జరిగిన ఈ ఎన్నికలలో ముద్దనూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవోగా విధులు నిర్వహిస్తున్న రత్నం జిల్లా ప్రధానకార్యదర్శిగా ఎన్నియ్యారు. జిల్లా అధ్యక్షుడిగా కొండయ్య ఎన్నికైనట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఉద్యోగులకు, జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగరాజు, గౌరవ సలహాదారు మాబూశానిలకు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రత్నం కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాలలో నీటి సమస్య రాకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణయ్య

ఎర్రగుంట్ల : మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలలో వచ్చే వేసవి కాలంను దృష్టిలో పెట్టుకుని నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. శనివారం మండల ప్రజా పరిషత్ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం ఉపమండలాధ్యక్షుడు మల్లు వెంకట మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖ అధికారులకు వారి శాఖకు సంబంధించిన నివేదికలను తెలియజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజకు అందేలా చూడాలన్నారు. తహసీల్దార్ శోభన్‌బాబు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయన్నారు. భూ రీసర్వే వల్ల జరిగిన అవకతవకలపై అధికంగా అర్జీలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ చౌక దుకాణాలను పెంచడానికి ప్రతిపాదనలు పంపించామని ఆరు దుకాణాలు పెరుగుతాయన్నారు. ఈఓపీఆర్డీ రహంతులయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ రామకృష్ణ, వెటర్నీ డాక్టర్ మహేశ్వర్, విద్యుత్ శాఖ ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి, ఉపాధి ఏపీఎం గంగాభవానీ, పంచాయతీరాజ్ ఏఈ వినయ్‌లతో ఇతర శాఖ అధికారులు వారి శాఖ పరమైన అభివృద్ధి, పథకాలను తెలియజేశారు.

చేనేతలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

జమ్మలమడుగు : ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ తెలిపారు. శనివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో చేనేతలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు చేనేత కార్మికులను ఆదుకోవడంతో పాటు చేనేతలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు ఐదువందల యూనిట్లు ఉచితంగా కరెంట్ ఇస్తామని నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోనికి వచ్చిన తర్వాత వాటిని మరచిపోయారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవడం కోసం వెంటనే రెండువేల కోట్ల రూపాయల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చేనేతలకు మూడు సెంట్ల స్థలంతోపాటు ఇళ్లను నిర్మించుకోవటానికి రూ.4 లక్షలు రుణం సైతం అటకెక్కించారన్నారు. చేనేత కార్మికుల సమస్యలను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించకపోతే వచ్చె నెల 24వ తేదీ కడప ఏడీ కార్యాలయం వద్ద చేనేత కార్మికులు ధర్నా నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



శ్రీరంగనాథస్వామి నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో శనివారం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆలయ చైర్మన్ సి.సుధీకర్‌రెడ్డి లాంచనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే నూతన సంవత్సరం, ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం పలు వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నామని, ముక్కోటి ఏకాదశి పండుగ సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ముక్కోటి ఏకాదశి నాడు స్వామి వారి కల్యాణం ఉంటుందన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్లు ఆలయంలో అందుబాటులో ఉంటాయని, భక్తులు ఈ క్యాలెండర్లను తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కొట్టే వెంకటరమణ, శ్రీరంగనాథ ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి కృష్ణ రాజేష్ శర్మ, రాజసింహ శర్మ, శ్రీరంగనాథ ట్రస్ట్ చైర్మన్ అల్లం చిన్న రంగనాయకులు, ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.